# సిరులు కురిపిస్తున్న ఆయిల్ పామ్

**ఎందుకూ పనికిరావనుకున్న మెట్ట ప్రాంత భూముల్లో ఇప్పుడు బంగారం పండుతోంది. రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తూ లాభాల బాటపట్టారు. దీంతో వరి, చెరకు పండిస్తున్న భూముల్లో కూడా ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 11,500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.**

- దిగుబడులు తగ్గినా.. పెరిగిన ధరలు
- లాభాల బాటలో రైతులు





ఆయిల్‌పామ్ గెలలు లోడ్ చేస్తున్న కూలీలు



శంకరంలో 30 ఏళ్లుగా ఆధాయాన్ని ఇస్తున్న ఆయిల్ పామ్ తోటలు

**నియోజకవర్గంలో సాగు వివరాలు**

| | |
|---|---|
| మాడుగుల 3,500 ఎకరాలు | దేవరాపల్లి 4,000 ఎకరాలు |
| చీడికాడ 2,000 ఎకరాలు | కె.కోటపాడు 2,000 ఎకరాలు |

**మాడుగుల:** కూలీల కొరత, పెరిగిన పెట్టుబడుల కారణంగా వరి, చెరకుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. మాడుగుల నియోజకవర్గంలో ప్రతీ ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రస్తుతం సుమారు 11,500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గత ఏడాది టన్ను ధర రూ.16,828 పలకగా ఈ ఏడాది రూ.19 వేలకు పెరిగింది. మాడుగుల మండలంలో శంకరం, తాటిపర్తి, అవురువాడ, ఎం.కోడూరు, కేజేపురం పంచాయతీల్లో 3,500 ఎకరాల్లో, దేవరాపల్లి మండలంలో చింతలపూడి, తామరబ్బ, దేవరాపల్లి, కాశీపురం, మారేపల్లి, వాలాబు, గరిసింగి తదితర గ్రామాల్లో నాలుగువేల ఎకరాల్లో, చీడికాడ మండలంలో కోనాం తదితర గ్రామాల్లో రెండు వేల ఎకరాల్లో, కె.కోటపాడు మండలంలోని పలు గ్రామాల్లో రెండు వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఒకప్పుడు కేవలం మెట్ట ప్రాంతంలో ఈ పంట సాగు చేసేవారు. ఇప్పుడు వరి, చెరకు పండే భూముల్లో కూడా పండిస్తున్నారు. అధిక లాభాలు వస్తుండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో పాటు స్థానిక రైతులు ఈ సాగుపై దృష్టి సారించారు. బుచ్చెయ్యపేట ఆయిల్‌పామ్ మిల్లు పరిధిలో మాడుగుల, బుచ్చెయ్యపేట, చోడవరం, సబ్బవరం, కశింకోట, పద్మనాభం, ఆనందపురం, అనకాపల్లి, భీమిలి మండలాల్లో విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ మండలాల్లో పండించిన ఆయిల్‌పామ్‌ను బుచ్చెయ్యపేట మండలం బంగారు మెట్ట వద్ద గల ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేసి క్రూడాయిల్ తయారు చేస్తారు. ఈ క్రూడాయిల్‌ను జంగారెడ్డి గూడెంకు ఎగుమతి చేస్తారు. ఆయిల్‌పామ్ గింజల నుంచి క్రూడాయిల్ తయారు చేసే కంపెనీ జిల్లాలో ఒక్క బంగారు మెట్టలోనే ఉండడం ఈ ప్రాంత ఆయిల్‌పామ్ రైతులకు వరంగా మారింది.

**ప్రభుత్వ రాయితీలు :** ఆయిల్‌పామ్ ఒక్కో మొక్క ధర రూ.73 కాగా, ప్రస్తుతం రైతులకు ఉచితంగా అందజేస్తున్నారు. ఎకరాకు 50 మొక్కలు అందజేస్తారు. మొక్కలు నాటి తరువాత నాలుగేళ్ల వరకు ప్రభుత్వం పెట్టుబడి అందజేస్తుంది. ఈ సమయంలో అంతర పంటల సాగుకు కూడా రాయితీలు అందజేస్తుంది. ఐదవ ఏట నుంచి పంట కాపునకు వస్తుంది. తక్కువ పెట్టుబడితో సుమారు 30 ఏళ్ల పాటు ఆదాయం వస్తున్న ఆయిల్‌పామ్ పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

### ధరలు పెరిగాయి

ఈ ఏడాది కొంత దిగుబడులు తగ్గాయి. ఎకరాకు ఏడు టన్నులు రావాల్సి ఉండగా ఆరు టన్నులే దిగుబడి వచ్చింది. గత ఏడాది టన్ను ధర రూ.16 వేల దాటి ఉండేది. ప్రస్తుతం రూ.19 వేలకు పైగా పలుకుతోంది. అందుబాటులో ఆయిల్‌పామ్ మిల్లు ఉండడం వల్ల పండిన వెంటనే తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆదాయం బాగుంది. దీంతో వరి, చెరకు సాగు చేసే భూముల్లో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఒకప్పుడు జిల్లాలో వరి, చెరకు, ప్రధాన పంటలు, కానీ నేడు ఆయిల్‌పామ్, సరుగుడు ప్రధాన పంటలుగా ఉన్నాయి.

– ఎ.వి. రామకృష్ణ, ఆయిల్‌పామ్ రైతు, మాడుగుల,

### ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం



మొక్కలు వేసిన తరువాత నాలుగేళ్ల పాటు ప్రభుత్వ రాయితీలు అందజేస్తుంది. ఆయిల్‌పామ్ తోటలు శాశ్వత ఆదాయం అందిస్తాయి. అందుబాటులో మిల్లులు ఉన్నాయి. ఈ పంటకు ప్రభుత్వ ప్రోత్సాహం అధికంగా ఉంది. గతంలో మెట్ట భూముల్లో సాగు చేసేవారు, ప్రస్తుతం మాగాణి భూముల్లో కూడా ఈ సాగు చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 70 హెక్టార్లలో సాగు పెంచారు.

– జి.విజయ దుర్గారావు, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ , మాడుగుల

## క్లుప్తంగా

### డైవర్షన్ రోడ్లు, వంతెనల పరిశీలన



పేటలో డైవర్షన్ రోడ్డును పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

**బుచ్చెయ్యపేట:** మండలంలో శిథిలావస్థకు చేరిన వంతెనలు,డైవర్షన్ రోడ్లను అనకాపల్లి డీఎస్పీ శ్రావణి శుక్రవారం పరిశీలించారు. అధిక వర్షాలతో వడ్డాది పెద్దేరు నది, విజయరామరాజుపేట తాచేరు నది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే వడ్డాది, విజయరామరాజు పేట గ్రామాల్లో శిథిల వంతెనలు కూలిపోగా, డైవర్షన్ రోడ్లు కోతకు గురయ్యాయి. తరచూ ట్రాఫిక్ జామ్ అవుతూ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.దీంతో ఆమె పేట,వడ్డాదిలలో రోడ్లు, వంతెన లు, డైవర్షన్ రోడ్లను పరిశీలించారు. ప్రత్యామ్నాయ రోడ్లపై ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని, శిథిల వంతెనలపై నుంచి భారీ వాహనాలు వెళ్లకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఎస్ఐ శ్రీనివాసరావుకు సూచించారు. ఆర్అండ్‌బి సిబ్బందితో డైవర్షన్ రోడ్లు,వంతెనల మరమ్మతు పనులపై మాట్లాడారు.

### యూరియా పంపిణీ



కె.జె.పురం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

**మాడుగుల రూరల్:** మండలంలోని కె.జె.పురం రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం యూరియా పంపిణీ చేశారు. కె.జె.పురంలో రెండు సచివాలయాల పరిధిలో గల రైతులకు, వంటర్లపాలెం రైతులకు సుమారు 540 యూరియా బస్తాలను పంపిణీ చేశారు.

### సీతారాం ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

**రోలుగుంట:** దివంగత సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. మండలంలో కొవ్వూరు పంచాయతీ శివారు గడబపాలెంలో నిర్వహించిన ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు ఈరెల్లి చిరంజీవి, రాము పాల్గొన్నారు.

### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



రేషన్ కార్డులు అందజేస్తున్న అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం:** కూటమి ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యత ఇస్తోందని స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు తెలిపారు. పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యక్రమంలో స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో 83,779 కార్డు లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో మూర్తి, ఆర్డీవో వి.వి.రమణ, తహసీల్దార్ రామారావు, ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జెడ్పీటీసీ రమణమ్మ పాల్గొన్నారు.

**మాడుగుల రూరల్:** వీరనారాయణంలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. సర్పంచ్ యల్లపు కొండప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, తహసీల్దారు కె.రమాదేవి, ఉప తహసీల్దారు ఎం. రాజా తదితరులు పాల్గొన్నారు. మాడుగుల స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో క్రీడా ప్రాంగణాన్ని ఎమ్మెల్యేబండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం ప్రారంభించారు.

### 15న చలో విజయవాడను విజయవంతం చేయాలి

**రాంబిల్లి(అచ్యుతాపురం):** ఈ నెల 15న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి చందక రామకృష్ణ పిలుపునిచ్చారు. రాంబిల్లి మండలం వెల్చూరు, పెద కలవలాపల్లిలో శుక్రవారం చలో విజయవాడకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డుని పునరుద్దరించాలని, పెండింగ్ క్లయిమ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమార్ధం ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజయవాడలో కమిషరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామన్నారు. భవననిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.

### బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ రవికుమార్ గుప్త

**బుచ్చెయ్యపేట:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ ఒవర్సీస్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రవి కుమార్ గుప్త తెలిపారు. శుక్రవారం వడ్డాదిలో జరిగిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో భాగంగా 18 నుంచి 70 ఏళ్ల లోపు వారు ఏడాదికి రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు ఏడాదికి రూ.436 చెల్లిస్తే సహజ మరణానికి రూ. 2 లక్షలు అందిస్తామన్నారు. ప్రమాదాల వల్ల మృతి చెందిన కుటుంబాలను బీమా నగదు ఆదుకుంటుందన్నారు. వడ్డాది బ్యాంకులో డ్వాక్రా సభ్యులకు రూ. కోటి యాభై లక్షల రుణం చెక్‌ను అందజేశారు. వడ్డాది బ్రాంచ్‌ని త్వరలో ఏసీ బ్రాంచ్‌గా మారుస్తామని ఆయన చెప్పారు. బ్యాంక్ మేనేజర్ జె.ఎం. నాయుడు, ఏపీఎం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు



కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**కె.కోటపాడు :** స్థానిక ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు శుక్రవారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ముగ్గురికి కంటి సమస్యలు ఉన్నట్టుగా ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది తనూజ నిర్ధారించి మందులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రేవతి, శివలక్ష్మి పాల్గొన్నారు.

## షాపులను స్వాధీనం చేసుకుంటాం



కొత్తకోట సచివాలయంలో విచారణ చేస్తున్న ఎంపీడీవో సీతారామస్వామి

**రావికమతం :** మండలంలోని కొత్తకోటలో గల ప్రభుత్వ వాణిజ్యసముదాయంలోని షాపులను స్వాధీనం చేసుకుంటామని ఎంపీడీవో సీతారామస్వామి తెలిపారు. ఈ వాణిజ్య సముదాయంలో గల 16 షాపులకు చాలా కాలంగా వేలం నిర్వహించడం లేదని, తక్కువ అద్దె చెల్లిస్తూ కొంతమంది షాపులు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ గతనెల 25న ఎంపీటీసీ పూడి దేవ కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తకోట సచివాలయంలో శుక్రవారం ఎంపీడీవో విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కొన్నాళ్లుగా దుకాణాలకు వేలం పాట నిర్వహించడంలేదని గుర్తించినట్టు చెప్పారు. ప్రస్తుతం షాపులు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేసి, వాటిని స్వాధీనం చేసుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం షాపులకు వేలం నిర్వహించి, పాడుకున్న వారిని అప్పగిస్తామని చెప్పారు.

## అధికారులు విధిగా మండల సమావేశాలకు హాజరు కావాలి

ఎంపీపీ సుర్ల రాజేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

**నర్సీపట్నం:** అధికారులు విధిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు హాజరు కావాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి ఆదేశించారు. శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధాన సమస్యలను చర్చించేందుకు నిర్వహిస్తున్న సమావేశాలకు అధికారులు రాకుండా కిందస్థాయి సిబ్బందిని పంపించడం తగదన్నారు. దీని వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని చెప్పారు. ఇకపై జరిగే సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఉషశ్రీకి సూచించారు. ప్రైవేటు డీలర్లు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, దాన్ని అరికట్టాలని ఎంపీటీసీ బోళెం రామ్‌ప్రసాద్ కోరారు. గురందరపాలెం సర్పంచ్ శానపతి వెంకటరత్నం మాట్లాడుతూ గ్రామ సచివాలయ భవనాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియజేయాలని కోరారు. ఆరు వారాల నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు అందడం లేదని ఆయన తెలిపారు. శాఖల వారీగా ప్రగతిని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో కార్యాలయ సూపరింటెండెంట్ రమణబాబు, ఏఎంసీ చైర్మన్ రమణ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షం

**మాడుగుల రూరల్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వరి నాట్లకు ఎంతో ఉపయోగకరమని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



పొలాల్లో చేరిన వర్షం నీరు

### నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారిగా ప్రసన్నకుమార్



వైద్యాధికారి ప్రసన్నకుమార్‌కు అభినందనలు తెలుపుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

**నాతవరం:** స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా ప్రసన్నకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఇద్దరు వైద్యులు జూన్ నెలలో బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇంతవరకు రెగ్యులర్ వైద్యులు లేక ఇన్‌చార్జ్‌లతో వైద్యసేవలందిస్తున్నారు. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం సప్పర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్నకుమార్‌ను ఇక్కడ నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రోగులకు సకాలంగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

### 200 మంది రక్తదానం

**పాయకరావుపేట:** తలసేమియాతో బాధపడుతున్న పిల్లల కోసం శుక్రవారం డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీలో మమత మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మదర్ బ్లడ్ బ్యాంకు, వైఎస్సార్ బ్లడ్ బ్యాంకు పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో కంపెనీ ఉద్యోగస్తులు సుమారు 200 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ కె.వి.ఎల్.పి.రాజు, వైస్ ప్రెసిడెంట్ అండ్ హెచ్‌ఆర్ పి.వి.ఎస్.ఎస్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

## సెల్ టవర్ కోసం వేడుకోలు



సెల్ టవర్ ఏర్పాటు చేయాలని చేతులు జోడించి కోరుతున్న గిరిజన మహిళలు

**రావికమతం:** మండలంలో కొట్నాబిల్లిలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని కోరుతూ రెండు చేతులూ జోడించి వేడుకుంటూ కొట్నాబిల్లి,టి.అర్జాపురం గ్రామాల గిరిజనులు కొట్నాబిల్లిలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండలంలోని కొట్నాబిల్లి,టి.అర్జాపురం పంచాయతీల పరిధిలో పి.కొట్నాబిల్లి,రామన్నదొరపాలెం,కొట్నాబిల్లి,గదపపాలెం గ్రామాల్లో 260 కుటుంబాలకు చెంది 800 మంది నివసిస్తున్నట్టు చెప్పారు. సెల్ సిగ్నల్స్ లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు తెలిపారు. అంబులెన్స్‌కు పోన్ చేయాలంటే గ్రామాలకు దూరంగా సిగ్నల్ ఉన్న ప్రాంతాలకు వెళ్లవలసి వస్తోందని వాపోయారు. ప్రభుత్వ పథకాలు పొందడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేసి, తమ కష్టాలు తీర్చాలని ఆదివాసీ గిరిజన మహిళా సంఘం సభ్యులు గౌరీ,అచ్చియ్యమ్మ,గిరిజన సంఘం గౌరవ అధ్యక్షుడు. కె.గోవిందరావు,పాడి బెన్నయ్య తదితరులు కోరారు.

## ఘనంగా హిందీ భాష వారోత్సవాలు



వివిధ వేషధారణల్లో అలంరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**నర్సీపట్నం:** హిందీ దివాస్ ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం బలిఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ భాష వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెలగా నారాయణరావు మాట్లాడుతూ హిందీ భాష జాతీయ సమైక్యతకు దోహదపడుతుందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలందరినీ ఒక తాటిపైకి తీసుకురావడానికి హిందీ ఎంతో ఉపయోగపడిందన్నారు. జాతీయ భాష హిందీని ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని తెలిపారు.వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వివిధ వేషధారణల్లో విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, హిందీ టీచర్ జలయలక్ష్మి, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

**చీడికాడ:** గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపీడీవోకు పలువురు ఉద్యోగులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్ల విధులను తమతో చేయించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయులపై సర్కార్ చిన్నచూపు

తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఏపీటీఎఫ్ నిరసన



మాకవరపాలెంలో తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



నాతవరం డిప్యూటీ తహసీల్దార్ లోవరాజుకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు



చీడకాడలో తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు



రోలుగుంట తహసీల్దార్ నాగమ్మకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు



బుచ్చెయ్యపేటలో తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



చోడవరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు



కె.కోటపాడులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాసరావు



నర్సీపట్నం తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

**మాకవరపాలెం:** తమ పట్ల రాష్ట్రప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తాత్సారం చేస్తోందని తెలిపారు. ఏపీటీఎఫ్ నిరసన వారంలో భాగంగా రెండో రోజు శుక్రవారం జిల్లాలో పలు తహసీల్దారు కార్యాలయాల వద్ద ఆందోళన చేసి, తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. మాకవరంపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీరామ్మూర్తి, మల్లేశలింగం మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, బకాయి ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వెంకటరమణకు అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సెలర్ ఆర్.వి.దొర తదితరులు పాల్గొన్నారు.

**నాతవరం:** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూండ్రపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. నాతవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం మండల శాఖ అధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.డిమాండ్ల సాధన కోసం ఈ నెల 17వ తేదీ వరకు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ టి.లోవరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకుడు ఎస్.వి.సత్యనారాయణ సీనియర్ ఉపాధ్యాయుడు శ్రీరామమూర్తి ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష,కార్యదర్శులు పైల అప్పన్నబాబు, ఎస్.జగన్నాథరావు తదతరులు పాల్గొన్నారు.

**రోలుగుంట:** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ మండల నాయుకులు తహసీల్దార్ సీహెచ్.నాగమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు పెదపాటి రమణ, ప్రధాన కార్యదర్శి అశోక్ సామ్రాట్, ఉపాధ్యక్షుడు బోనెల రాము, కార్యదర్శి ఐ.రామశేషు, బి.ఆదినారాయణ, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

**చోడవరం:** ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మైచర్ల మహాలక్ష్మినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆర్.చిరంజీవి, కె.మల్లేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు గొల్లు శ్రీనివాసరావు, టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి ఆర్.వి.ఎస్. సత్యనారాయణ, జిల్లా కౌన్సిలర్స్ కశిరెడ్డి శ్రీనివాసు, డోకల సింహాచలంనాయుడు, వంటాకు గోవిందరావు, బి.వి.కె. కిషోర్, కె. వీర భద్రరావు, ఎం. శ్రీనివాసు, ఆర్. ఈశ్వరరావు, కండేల వెంకట్రావు, సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

**చీడికాడ:** నిరసన వారంలో భాగంగా స్థానిక తహసీల్దార్‌కు పలు సమస్యలపై శుక్రవారం ఏపీటీఎఫ్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ మండల అధ్యక్షుడు జి.పి.ఎ. నాయుడు, ప్రధాన కార్యదర్శి మండల ఫణికుమార్, గౌరవ అధ్యక్షుడు లెక్కల ప్రసాదు, జిల్లా ఉపాధ్యక్షురాలు కె. విజయలక్ష్మి, తురువోలు హెచ్ఎం రామకృష్ణ తదతరులు పాల్గొన్నారు.

**బుచ్చెయ్యపేట:** స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాదు, మండల అధ్యక్షులు శేషు, ప్రధాన కార్యదర్శి మధుకృష్ణ తదితర్లు పాల్గొన్నారు.

**కె.కోటపాడు :** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నంబర్ 57ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కె.కోటపాడులో తహసీల్దార్ బుజంగరావుకు శుక్రవారం ఏపీటీఎఫ్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. మెమో నంబర్ 57 అమలు అయితే 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పెన్షన్ సదుపాయం కలుగుతుందని శ్రీనివాసరావు తెలిపారు. ఏపీటీఎఫ్ కార్యవర్గ సభ్యులు బోకం ప్రసాద్, సూరిబాబు, కామేశ్వరరావు, సూర్రెడ్డి బాబూరావు, కిలపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**నర్సీపట్నం:** తక్షణమే వేతన సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఏపీటీఎఫ్ నాయకులు ఎన్.గోవింద్, డి.నూకరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.